సర్వ అనర్థాలకు దేహాభిమానం కారణం. దేహాభిమానం నశిస్తే ఏమీలేదు. ఏ దేవుడిని ఆరాధించినా వాసనాక్షయం ముఖ్యం. చిన్న వాసన ఉంటే పునర్జన్మ వస్తుంది. దేహాన్ని సుఖపెట్టటం కోసం, మనస్సును సంతోషపెట్టటం కోసం నీవు రిపీటెడ్‌గా పని చేస్తూ ఉంటే అదే సంస్కారంగా వస్తుంది. అందులోనుండి వాసన వస్తుంది. నీ హృదయంలో ఉన్న స్వర్గం నీకు అందినప్పడు రాబోయే జన్మల గొడవ, లోకాలగొడవ, సంతోషాల గొడవ ఏమీ నీకు ఉండదు. అది ఎప్పడు నీకు అందుతుంది అంటే నీకు వాసనాక్షయం అయినప్పడు అదిఅందుతుంది. దేహసౌందర్యాన్ని చూసి మురిసిపోకు, హృదయ సౌందర్యాన్ని పెంచుకో. సమాజానికి నీవు ఏదైనా చేసినా దానినుండి నీవు ఏమీ ఆశించకు, ఆధ్యాత్మికంగా అభివృద్ధి చెందటం చూసుకో. Be Brave, Be Moral అని బాబా గారు చెప్పేవారు. ఎవరో ఏదో అన్నారని నీవు కంగారుపడకు. నీ నిదానంలో నీవు ఉండు. పని మొదలుపెట్టి సాయంకాలానికి అయిపోవాలి అని అనుకోవద్దు. కొబ్బరిమొక్కను ఉదయంవేసి సాయంకాలానికి కాయలు కాయాలి అని అంటే కాస్తుందా? కాయదు. నీవు సహనంగా ఉండు, నిదానంగా ఉండు, కాలం కలిసివచ్చినపుడు ఆ పని పూర్తిఅవుతుంది. ఈ లోపు నీకు కావలసింది ఆగ్రహంకాదు, నిగ్రహం కావాలి. దైవీ సంపదలేకపోతే మనం దైవాన్ని స్మరించలేము. ఆయన దయవలన మాత్రమే ఆయనను స్మరించగలము. అవసరం లేకుండా ప్రతీ దానిలో నేనును కలవనివ్వకూడదు. నీకు రెండుచేతులు ఉన్నాయి ఒకచేతితో శ్రద్ధను, ఒకచేతితో సహనాన్ని పట్టుకో నీవు గమ్యాన్ని చేరిపోతావు. నీ బుద్ధి బాగుపడితే కలియుగంలో ఉన్నా కృతయుగంలాగ ఉంటుంది, నరకానికి వెళ్ళినా అది స్వర్గంగా మారిపోతుంది.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణములు, 10-4-2000, సిద్ధాపురం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

కేవలము విష్ణువు ఒక్కడే దేవుడు అని విష్ణువును ఉపాసన చేసే వారిని వైష్ణవులు

అని, శివుడు ఒక్కడే దేవుడు అని శివుడిని ప్రధానంగా ఆరాధిచేవారిని శైవులని అంటారు. మనం ఆ పార్టీకాదు, ఈ పార్టీకాదు. మనకు విష్ణువు, శివుడు సమానమే. మనలను స్మార్తులు అంటారు. శివకేశవ బేధం లేని వారిని స్మార్తులు అంటారు. ఎన్నో సిద్దులు ఉన్నాయి. కొంత మంది చనిపోయిన మనిషిని కూడా బ్రతికించగలరు. అటువంటి సిద్దులు కూడా ఉన్నాయి. జ్ఞానం ముందు ఈ సిద్దులు ఏపాటివి అనేవారు భగవాన్‌జ్ఞానం యొక్క వైభవం నీకు తెలియనప్పుడు ఈ సిద్దులు నీకు చాల గొప్పగా ఉంటాయి. జ్ఞానం యొక్క వైభవం నీకు తెలిసినప్పుడు చనిపోయిన మనిషిని బ్రతికించటంకూడా ఏమీ విశేషం క్రింద నీకు అనిపించదు. ఎన్ని సిద్దులు ఉన్నా నీకు జ్ఞానం లేకపోతే నీ పని బండిసున్నా. రామకృష్ణ పరమహంసతో ఒకరు నేను పది సంవత్సరాలు కష్టపడి నీటి మీద నడవటం నేర్చుకొన్నాను వచ్చి చూడండి అని చెప్పాడు. నీవు పది సంవత్సరాలు నేర్చుకొన్న విద్య ఒక అణా విలువ అన్నారు. మేము ఒక అణా ఇస్తే పడవ మీద నదిని దాటిస్తారు. నీవు అణా అక్కరలేకుండా నదిని దాటుతున్నావు అంటే నీవు నేర్చుకొన్న విద్య ఒక అణా విలువ అని రామకృష్ణుడు చెప్పాడు. నీకు జ్ఞానం లేనప్పుడు ఇవి అన్నీ బ్రహ్మాండముగా కనిపిస్తాయి. ఇవి అన్నీ తాత్కాలిక విషయములు. ఏది అయితే సత్యం కాదో, ఏది అయితే నిత్యం కాదో దాని కోసం ఎగపడటం ఎందుకు? నీ కాలాన్ని, శక్తిని దుర్వినియోగం చేసుకోవటం ఎందుకు? నీ మనస్సు అణిగినప్పుడు, నీ మనస్సు నిర్మలం అయినప్పుడు ఈ సృష్టిలో ఎవరూ నీకు దుఃఖం తీసుకొని రాలేరు. నీకు ఇప్పుడు సుఖం లేదు, శాంతి లేదు, పూర్వజన్మలు ఏమిటో నీకు తెలుస్తున్నాయి అనుకోండి దాని వలన ఏమిటి ప్రయోజనం? లోకంలో అనేక ఆకర్షణలు ఉంటాయి. అందులో ఏ ఆకర్షణలో మనం పడినా గమ్యానికి వెళ్ళలేము. భగవంతుడు నీకు జ్ఞానమే ఇచ్చేటప్పుడు ఇంక సిద్దులు కోసం వేడుకోవలసిన పనిలేదు. సిద్దుల వలన మోక్షం రాదు, జ్ఞానం వలన మోక్షం కలుగుతుంది. జ్ఞానం కలిగిన తరువాత సిద్దులు స్వప్నసమానం అని నీకు తెలుస్తుంది. సిద్దులు అశుద్దంతో సమానము వాటి జోలికి వెళ్ళకండి, బ్రహ్మానుభవం పొందటం కోసం ప్రయత్నం చేయండి అని రామకృష్ణుడు చెప్పాడు. నీ హృదయంలో ఈశ్వరుడు నివాసంగా

ఉంటే, ఆయనకోసం నీవు తపిస్తే నీకు జ్ఞానం వస్తుంది, సిద్ధులు వస్తాయి. జ్ఞానం వచ్చిన తరువాత మీకు సిద్ధులు వస్తే పరవాలేదు, జ్ఞానం రాకుండా మీకు సిద్ధులు వస్తే మీరు మాయలో పడతారు, మీ సిద్ధులే మిమ్మల్ని పాడుచేస్తాయి. భగవంతుడికి పాదాక్రాంతుడు అయినవాడు ఏ సిద్ధులు కోరుకోడు. మీకు భగవంతుని మీద నిజమైన ప్రేమ కలిగితే సిద్ధులు కావాలనే సంకల్పం కూడా మీకు ఉదయించదు. నీవు కోరికల కోసం, సిద్ధులకోసం భగవంతుని ఆరాధిస్తూ ఉంటే ఇంకా మాయలో బిగుసుకొని పోతావు, ఉరితాడు బిగుసుకొని పోతుంది. నీవు ఏదికోరితే అది ఈ జన్మలో కాకపోయినా వచ్చే జన్మలో అయినా తీరుస్తాడు, అవి ఎంతవరకు నీకు మేలుచేస్తాయి. సిద్ధులు ప్రదర్శించే శక్తి మీకు వచ్చింది అనుకోండి దాని వలన మీ మనస్సు బలపడుతుంది, దేహాభిమానం పెరిగిపోతుంది.

మీరు ఎందుకు మోక్షాన్ని కోరుకొంటున్నారు? ఇప్పుడు ఎలా ఉన్నారో ఆ స్థితిలో ఉండవచ్చుకదా అంటున్నారు భగవాన్. ఇప్పుడు మీరు ఉన్న స్థితి నిజంకాదు. మీకు ఎన్ని సంపదలు ఉన్నా మీలోపల ఏదో వెలితి ఉంది అది మీకు తెలుస్తుంది. అందువలన మీరు మోక్షాన్ని కోరుకొంటున్నారు. ఏదైతే నిజమో అక్కడకు వెళ్ళేవరకు నీ బుద్ధి ఆగదు. ఈ లోపు నిజం కానిదానిని నిజం అని నమ్మవచ్చు. అది నిజంకాదు అని తెలిసిన తరువాత దానిని వదిలేస్తుంది. జ్ఞాన సముపార్జన మీదే మీ దృష్టి ఉండాలి. మనం ఇది భౌతికం ఇది ఆధ్యాత్మికం అని వేరుచేస్తున్నాము. ఇలా వేరుచేయటం వలననే వస్తువు మనకుఅర్థం కావటంలేదు. విశ్వం, విష్ణువు రెండూ ఒక్కటే. మనం దేహానికి, లోకానికి బంధింపబడ్డాము కాని రాముడి పాదాలకు బంధింపబడలేదు. దేవుడు ఉన్నాడని నోటితో చెపుతాము కాని ఆయన మీద మనకు విశ్వాసం లేదు. దానికి స్వార్థమే కారణం. ఎవరో మిమ్మల్ని శత్రువులు అనుకొంటే మీకు ప్రమాదం లేదు, మీరు ఎవరినీ శత్రువులుగా భావించవద్దు. దాని వలన మీ మనస్సు బాహ్యాముఖానికి వెళ్ళిపోతుంది. మీకు శత్రుభావన అలాగే ఉండిపోతే జన్మాంతరంలో కూడా మీమమనస్సు కూడా శత్రుభావన వచ్చేస్తుంది. రాబోయేజన్మలో కడా శత్రువులుగానే పుడతారు. మీకు మహిమలు వస్తే

వాటిని ప్రదర్శించాలని, అందరూ మిమ్మల్ని గౌరవించాలని ఇటువంటి బుద్ధులు వస్తాయి. మెప్పులు కోరతారు. మెప్పులు కోరితే ఇంక తిప్పలు తప్పవు. ఎదుటి వారు మిమ్మల్ని మెచ్చుకోవాలనుకోవటం అది దరిద్రలక్షణం. ఎవరో మెప్పకోసం మీరు ఉపకారం చేస్తారు. వారు మెచ్చుకోకపోతే మీకు దుఃఖం వస్తుంది. మీకంటే ఇంకొకరు ఎక్కువ ఉపకారం చేస్తే మీకు అసూయ వస్తుంది. ఇవి అన్నీ జీవలక్షణాలు. దేహాభిమానం చుట్టూ తిరగటం వలన ఈ అల్లరి అంతా వస్తోంది. తల్లి కూతురుకు ఏదైనా ఇస్తే ఆ కూతురు మెచ్చుకోవాలని అనుకొంటుంది. ఇవి జీవలక్షణాలు ఈ జీవలక్షణాలు దాటితే గాని రాముడిపాదాలు దొరకవు. చెట్టు చిటారుకొమ్మ ఆకుమీద నిద్రపోవాలనుకోవటం ఎటువంటిదో జీవలక్షణాలు దాటకుండా మోక్షం పొందాలనుకోవటం అటువంటిదే. దేశంలో ఉన్న దారిద్ర్యం అంతా పోగొట్టవచ్చు గాని మనస్సులో ఉన్న దారిద్ర్యం నీవు తొలగించుకోలేవు. ప్రపంచాన్ని జయించగలవుగాని మనస్సును జయించటం కష్టం. ప్రపంచాన్ని జయించిన వాడు దేవుడు కాదు, మనస్సును జయించినవాడు దేవుడు అవుతాడు. ఇందులో ఉన్న చిక్కు మీరు అర్థం చేసుకోండి. ఏ వస్తువును తెలుసుకొన్నాక మీకు శాంతి కలుగుతుందో ఆ వస్తువును తెలుసుకోండి, ఆ సిద్ధిని కోరుకోండి. చనిపోయిన మనిషిని బ్రతికించటం కాదు మీరు కోరుకొనేది. ఇవాళ వాడిని మీరు బ్రతికించినా రేపు ఎలాగూ పోతాడు. ఈ గొడవలు వద్దు. మీరు ఆత్మసిద్ధిని కోరుకోండి. మనస్సులో మాయ ఉంది. అందులోనుండి బయటకు రావాలంటే స్వామీజి ఏమి చెప్పారు అంటే సముద్రంలో బుడగలు ఉంటాయి. కెరటాలు ఉంటాయి, నురుగు ఉంటుంది. కెరటాన్ని కెరటంగా చూడకు నీరుగానే చూడు, బుడగలో కూడా నీరునే చూడు, నురుగులో కూడా నీరునే చూడు. వీటి అన్నింటిలో ఉన్నది నీరే. అందువలన నీటినే చూడు. అప్పుడు నామ, రూప దృష్టి పోతుంది. అఖండ దృష్టి నీకు కలుగుతుంది.

****

5-5-2000